బలిపీఠంపై తెలంగాణ ఆర్థికం!

కేసీఆర్ పాలనలో రాకెట్ వేగంతో తెలంగాణ ఆర్థిక వృద్ధి • పదేండ్లలో భారీగా పెరిగిన తలసరి ఆదాయం, జీఎస్డీపీ, బడ్జెట్

- కాంగ్రెస్ అసమర్థతతో ఏడాదిలోనే తిరోగమన దిశగా రాష్ట్ర ఆర్థికం
- అసంబద్ధ విధానాలు, అసమర్థ పాలనతో ఆగిన వృద్ధి
- కొవిడ్ తర్వాత తొలిసారి పడిపోయిన రెవెన్యూ రాబడులు
- ఒక్క ఏడాదిలోనే రూ.30వేల కోట్ల వరకు నష్టం
- అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎడాపెడా అప్పులు
- 15 నెలల్లోనే రూ.లక్షన్నర కోట్లకుపైగా రుణాలు



“ ‘దీర్ఘకాలిక ప్రయోజనాలు, రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల దృష్ట్యా రాష్ట్రం బాగున్నదనే చెప్పాలి. లేదంటే రాష్ట్ర పరపతి దెబ్బ తింటుంది, పెట్టుబడిదారులకు నమ్మకం పోతుంది.’

- గత సంవత్సరం మే నెలలో కేసీఆర్ చేసిన సూచన ఇది.

“ ‘రాజకీయం కోసం రాష్ట్రం పరువు తీయొద్దు. రాష్ట్రం అప్పుల కుప్ప అంటూ ప్రచారం చేసి ఒక బీమారీ రాష్ట్రంగా చూపించొద్దు. ప్రపంచానికి రాష్ట్రంపై తప్పుడు మెసేజ్ వెళ్తే తీరని నష్టం జరుగుతుంది.’

- 2023 డిసెంబర్‌లో ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ చేసిన హెచ్చరిక

“ ‘రాష్ట్రాన్ని అప్పలకుప్పగా మార్చారు. ప్రతీ నెల వచ్చే ఆదాయం, చేస్తున్న అప్పలు కూడా సరిపోవడం లేదు.’

- సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే చేస్తున్న ప్రచారం.. ప్రతిపక్షాన్ని తిట్టడంపై తప్ప పాలనపై శ్రద్ధ లేకపోవడంతో రాష్ట్రానికి గుండెకాయ వంటి ఆర్థికరంగం తిరోగమన దిశగా సాగుతున్నది.

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ‘ఒక వ్యక్తికి రోజుకో బంగారు గుడ్డు పెట్టే బాతు దొరుకుతుంది. అత్యాశకు పోయి మొత్తం బంగారం ఒకేసారి తీసుకుందామని దాన్ని కోస్తాడు..’ ఆ తర్వాత ఏం జరుగుతుందో, దాని సారాంశం ఏమిటో మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ పాలన రాష్ట్రాన్ని అలాగే చేసిందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ‘బంగారు తెలంగాణ’ నినాదంతో దూసుకెళ్లిన రాష్ట్రాన్ని ‘తిరోగమన తెలంగాణ’గా మార్చారంటూ వారు మండిపడుతున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాకెట్ వేగంతో దూసుకుపోయిన ఆర్థిక రంగం.. కేవలం 15 నెలల పాలనలో తిరోగమన దిశగా సాగడమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్తున్నారు. ‘ఇక్కడ లంకెబిందెలు దొరుకుతాయని వస్తే ఖాళీ కుండలు ఉన్నాయి’ అన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలను బట్టే అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి ఎందుకు వచ్చారో అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెప్తున్నారు. ఓవైపు అసంబద్ధ నిర్ణయాలు, మరోవైపు అసమర్థ పాలన.. అన్నింటికీ మించి ‘దివాలా’ ప్రచారం రాష్ట్ర పరపతిని దెబ్బతీశాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా రెవెన్యూ రాబడుల్లో తిరోగమనం నమోదైందని అంటున్నారు. కరోనా తర్వాత ఆ స్థాయిలో ఆర్థిక రంగానికి కాంగ్రెస్ పాలన విపత్తుగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతీసిన ‘దివాలా’ ప్రచారం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది మొదలు.. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, పూట గడవడమే కష్టంగా ఉన్నదని ప్రచారం మొదలు పెట్టింది. స్వయంగా రేవంత్‌రెడ్డి అనేక వేదికల్లో ఈ విషయాన్ని చెప్పారు. ఇది రాష్ట్రానికి మంచిది కాదని ఆర్థిక నిపుణులు హెచ్చరించినా పట్టించుకోలేదు. మనం బాగున్నామని చెప్తేనే ఎవరైనా రూపాయి అప్పు ఇస్తారు. మనల్ని నమ్మి పెట్టుబడి పెడతారు. అలా కాకుండా పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయామని చెప్తే దగ్గరికి కూడా రారు. కానీ కాంగ్రెస్ మాత్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర పరువును బజారున పడేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచీ ‘కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్ప అయ్యింది’ అంటూ విమర్శలు చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని ప్రచారం చేసింది. ‘రాష్ట్రానికి ప్రతి నెల వచ్చే ఆదాయం సరిపోవడం లేదు.. మళ్లీ అప్పు చేయాల్సి వస్తున్నది’ అంటూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి తరచుగా వ్యాఖ్యానిస్తున్నారు. పరోక్షంగా రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందనే సందేశాన్ని ఇచ్చారు. కేవలం కేసీఆర్‌పై, బీఆర్‌ఎస్‌పై రాజకీయ కక్షతో చేసిన ఈ ప్రచారం రాష్ట్రానికే శాపంగా మారిందని ఆర్థిక నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిలోనే రూ.30వేల కోట్ల నష్టం..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం సగటున ప్రతీ సంవత్సరం రూ.14వేల కోట్లు పెరిగినట్టు గణాంకాలు చెప్తున్నాయి. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయం తగ్గిపోయిందని కాగ్‌కు సమర్పించిన నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. 2023-24తో పోల్చితే 2024-25 జనవరి నాటికి రెవెన్యూ వసూళ్లు రూ.13 వేల కోట్లు తక్కువగా నమోదైనట్టు కాగ్ నివేదిక స్పష్టం చేస్తున్నది. అంటే ప్రతీ త్రైమాసికానికి సగటున రూ.4వేలు నష్టపోయిందన్న మాట. ఈ లెక్కన చివరి త్రైమాసికం కూడా గణిస్తే రూ.16 వేల కోట్ల వరకు లోటు తప్పదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంటే.. ఏటా పెరగాల్సిన రూ.14వేల కోట్లు రాకపోగా, రావాల్సిన ఆదాయంలోనే రూ.16వేల కోట్లు రాష్ట్రం నష్టపోయిందని చెప్తున్నారు. దీనిని బట్టి ఏడాది కాలంలోనే ఏకంగా రూ.30 వేల కోట్లు నష్టపోయినట్టని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ అప్పు.. లక్షన్నర కోట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం గత 15 నెలల్లో అధికారికంగా చేసిన అప్పులు లక్షన్నర కోట్లు దాటాయి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,52,918 కోట్లకు చేరుకుంది. 459 రోజుల్లో రోజుకు సగటున రూ.333 కోట్లకుపైగా అప్పు చేసిందని విశ్లేషకులు చెప్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విధించిన ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిని దాటి రాష్ట్ర సర్కారు అప్పులు చేసింది. వాస్తవానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని కేంద్ర ప్రభుత్వం రూ.49,255 కోట్లుగా విధించింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొలి మూడు త్రైమాసికాల్లో (నిగతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) రూ.41,759 కోట్లు రుణం తీసుకున్నది. అంటే.. కేంద్రం అనుమతించిన అప్పులో జనవరి నాటికి ఇంకా రూ.7,500 కోట్లు మాత్రమే మిగిలింది. కానీ ప్రభుత్వం ప్రస్తుత చివరి త్రైమాసికంలో (జనవరి, ఫిబ్రవరి, మార్చిల్లో) ఏకంగా రూ.30 వేల కోట్ల అప్పు తీసుకుంటామని ఆర్బీఐకి ఇండెంట్లు పెట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అడిగినంత అదనపు రుణం ఇచ్చేందుకు కేంద్రం నిరాకరించింది. ఫలితంగా కొన్ని వారాల పాటు ఆర్బీఐ బాండ్ల వేలంలో తెలంగాణ పాల్గొనలేదు.

రేవంత్ తెచ్చిన అప్పులు ఏం చేసినట్టు?

రాష్ట్ర ప్రభుత్వం చేసిన లక్షన్నర కోట్లతో ఏం చేసిందనేది ప్రశ్నార్థకంగా మారింది. గత 15 నెలల్లో ఒక్క భారీ ప్రాజెక్టునైనా చేపట్టిందా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, భారీ భవనాలు, రోడ్లు, కాలేజీలు.. ఇలా అనేక ఆస్తులు సృష్టించిందని గుర్తు చేస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్ల రుణంతో రాష్ట్రానికి సృష్టించిన ఆస్తి ఒక్కటి కూడా లేదని, సంక్షేమ పథకాలైనా సక్రమంగా అమలవుతున్నాయా? అంటే అదీ లేదని చెప్తున్నారు. ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ విషయంలో హెచ్చులకు పోయి తీసుకున్న తప్పుడు నిర్ణయాలు భస్మాసుర హస్తంగా మారిపోయాయని అంటున్నారు. రుణమాఫీ చేసే పరిస్థితి లేదని ఆర్థిక శాఖ అధికారులు మొత్తుకుంటున్నా, దానికి బదులు రైతు భరోసా ఇవ్వాలని ఆర్థిక నిపుణులు సూచించినా చెవిన పెట్టలేదని వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న ఆందోళన అన్ని వర్గాల్లోనూ కనిపిస్తున్నది.

కేసీఆర్ తెచ్చిన నిధులు రాష్ట్రాభివృద్ధికే..

‘అప్పును భారంగా చూడకుండా.. పెట్టుబడిగా భావించాలి. సరైన మార్గంలో పెట్టుబడి పెడితే దానికి సార్థకత చేకూరుతుంది. అప్పుకు మించిన ఆదాయం, అంతకుమించిన ప్రయోజనాలు కనిపిస్తాయి’ అని ఆర్థిక నిపుణులు చెప్తుంటారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ నియమాన్ని అక్షరాలా పాటించింది. రుణాల రూపంలో సేకరించిన అప్పులను మూలధన వ్యయంగా రాష్ట్ర అభివృద్ధికి ఖర్చు చేసింది. సంపదను సృష్టించింది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసింది. ఎండిన పొలాలను నదీజలాలతో తడిపి వ్యవసాయాన్ని పండుగ చేసింది. ఫలితంగా పంట ఉత్పత్తులు పెరిగాయి. మౌలిక వసతుల అభివృద్ధితో పారిశ్రామిక, రవాణా, రియల్ ఎస్టేట్ వంటి రంగాల రూపురేఖలే మారిపోయాయి. ఆదాయాన్ని సంక్షేమ పథకాల రూపంలో పంచింది. తద్వారా ప్రజల చేతుల్లోకి డబ్బు వెళ్లింది, ఇది కొనుగోళ్లు, పెట్టుబడుల రూపంలో తిరిగి మార్కెట్‌లోకి వచ్చింది. తద్వారా పన్నుల రూపంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం వచ్చింది. ఇలా పదేండ్లలో చేసిన అప్పులను సక్రమంగా ఖర్చు చేయడంతో.. రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి.

తెలంగాణ ఏర్పడేనాటికి సొంత పన్నుల ఆదాయం కేవలం రూ.29వేల కోట్లు. కానీ పదేండ్లలోనే రూ.1.36 లక్షల కోట్లకు పెరిగింది. అంటే నాలుగు రెట్లకుపైగా వృద్ధి నమోదైంది. అప్పులను సక్రమంగా ఖర్చు చేస్తే రూపురేఖలే మార్చవచ్చనడానికి వ్యవసాయ రంగం ప్రత్యక్ష ఉదాహరణ. తెలంగాణ ఏర్పడేనాటికి 20 లక్షల ఎకరాలకే సాగునీరు అందేది. పదేండ్ల తర్వాత 1.03 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించే స్థాయికి తెలంగాణ ఎదిగింది. ఇందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోపాటు అనేక పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం, కొత్త ప్రాజెక్టులు చేపట్టి విజయవంతంగా సాగునీరు అందించడం, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం వల్లే సాధ్యం అయ్యింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు.. 2004-2014 మధ్య ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.38,405.12కోట్లు వెచ్చించగా, కొత్తగా వచ్చిన ఆయకట్టు 5.71లక్షల ఎకరాలు మాత్రమే. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో ప్రాజెక్టులపై వెచ్చించిన మొత్తం రూ.1,64,210 కోట్లు. 2014-2023 మధ్య సాగులోకి తీసుకొచ్చిన ఆయకట్టు 17.23 లక్షల ఎకరాలు. ఫలితంగా పంట ఉత్పత్తులు పెరిగాయి. రైతులకు ఆదాయం సమకూరింది. ఇది కొనుగోళ్లు, పెట్టుబడుల రూపంలోకి మారింది.

నవంబర్ నుంచి ఆర్థిక పతనం..

రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ విధానాల ఫలితంగా ఆర్థికరంగం పతనం ఎప్పుడో మొదలుకాగా.. నవంబర్ నుంచి మరింత దిగజారింది. ప్రభుత్వం స్వయంగా కాగ్‌కు సమర్పించిన నివేదికలోనే ఈ వివరాలను వెల్లడించింది. నిరుడు నవంబర్ నాటికి ఖజానాకు రూ.1,11,141.37 కోట్ల రెవెన్యూ రాబడులు రాగా.. ఈసారి రూ.1,03,300 కోట్లుగా నమోదైంది. అంటే రూ.7,841.33 కోట్లు (7.05 శాతం) తగ్గుదల కనిపించింది. వాస్తవానికి రాబడుల పరంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఏటికేడు వృద్ధి సాధిస్తున్నది. కరోనాతో 2020-21లో ఆదాయం పడిపోయినా.. ఆ మరుసటి సంవత్సరమే కోలుకున్నది. కానీ.. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి ఆదాయం నవంబర్ నుంచి తిరోగమనం వైపు సాగుతున్నది. ఇక.. జనవరి వరకు ఈ ఆర్థిక సంవత్సరం పది నెలలకు సంబంధించిన నివేదికను పరిశీలిస్తే.. ప్రభుత్వం అంచనా వేసిన ఆదాయంలో సగం మాత్రమే వచ్చింది. 2024-25 బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులు రూ.2,21,242 కోట్లుగా అంచనా వేయగా, జనవరి నాటికి రూ.1,23,815 కోట్లు మాత్రమే వచ్చాయి. అంటే 55.96 శాతం మాత్రమే నమోదైంది. నిరుడు ఇదే కాలానికి రెవెన్యూ రాబడులు 63.20 శాతంగా ఉండటం గమనార్హం. ఇక ఏటికేడు పోల్చిచూసినప్పుడు రెవెన్యూ రాబడుల్లో భారీ క్షీణత నమోదైంది. నిరుడితో పోల్చితే జనవరి నాటికి రెవెన్యూ రాబడుల్లో రూ.13,044.9 కోట్లు లోటు నమోదైందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు జీఎస్టీ వసూళ్లలోనూ తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది రూ.58,594.91 కోట్లుగా అంచనా వేయగా రూ.42,657.9 కోట్లు వచ్చాయి. లక్ష్యంలో ఇది 72.8 శాతం మాత్రమే. ఇదే సమయానికి నిరుడు జీఎస్టీ వసూళ్లు 75 శాతం నమోదయ్యాయి.



కేసీఆర్ పాలనలో రాకెట్ వేగంతో ఆర్థిక వృద్ధి..

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా రాకెట్ వేగంతో వృద్ధి సాధించిందనడానికి గణాంకాలే నిదర్శనం. సాధారణంగా ఒక రాష్ట్రం లేదా ఒక దేశ ఆర్థిక వృద్ధిని కొలవడానికి నాలుగు కీలక అంశాలు ఉంటాయి. సొంత రాబడులు, తలసరి ఆదాయం, జీఎస్డీపీ, బడ్జెట్. వీటితోపాటు అప్పులు అదుపులో ఉండటం కూడా ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనంగా పేర్కొంటారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ ఐదు అంశాల్లోనూ తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



జీఎస్డీపీ పెరుగుదల (రూ. కోట్లలో)

2014-15	5,05,849
2015-16	5,77,902
2016-17	6,58,325
2017-18	7,50,050
2018-19	8,57,427
2019-20	9,50,090
2020-21	9,42,814
2021-22	11,28,907
2022-23	13,13,391
2023-24	14,63,960

బడ్జెట్ పెరుగుదల (రూ.కోట్లలో)

2014-15	1,00,638
2015-16	1,15,689
2016-17	1,30,416
2017-18	1,49,646
2018-19	1,74,454
2019-20	1,46,492
2020-21	1,82,914
2021-22	2,30,726
2022-23	2,56,859

సొంత పన్నుల రాబడిలో వృద్ధి (రూ.కోట్లలో)

2014-15	29,288
2015-16	39,975
2016-17	48,408
2017-18	58,177
2018-19	65,040
2019-20	67,597
2020-21	79,196
2021-22	92,910
2022-23	1,08,211
2023-24	1,38,181



This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

Format C-2

(For political party to publish in website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Name of Political Party : **BHARAT RASHTRA SAMITHI**

*Name of Election : **BIENNIAL ELECTION TO TELANGANA LEGISLATIVE COUNCIL-2025**

Name of State/~~UT~~ : **TELANGANA**

1	2	3	4		5		
Sl. No.	Name of Constituency	Name of candidate	(A)Pending criminal cases		B) Details about cases of conviction for criminal offences		
			Name of Court, case No. & Status of the cases(s)	Sections of the Acts concerned & brief description of offence(s)	Name of Court & date(s) of orders(s)	Description of offence(s) & Punishment imposed	Maximum Punishment Imposed
1.	**BY THE MEMBERS OF LEGISLATIVE ASSEMBLY (MLAs)**	**Dr. DASOJU SRAVAN KUMAR.**	XVth ACMM Criminal Court Complex at Nampally CC.No.10404 of 2023 FIR NO. 304 of 2023 at Shainayath gunj Police Station	Sec.188 of IPC This is a Suo Motu Police case alleging that I was found along with the contesting candidate on 29th November 2023 at about 19.00 Hours at Sriram Colony, Begum Bazar, Hyderabad in violation of Model Code of Conduct during General Eelections-2023, Telangana.	-NA-	-NA-	-NA-

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Sd/-

SOMA BHARAT KUMAR

GENERAL SECRETARY

Bharat Rashtra Samithi

స్తంభించిన జీఎస్టీ రాబడులు



జీఎస్టీ వసూళ్లలోనూ స్తబ్దత నెలకొన్నది. ఈ ఏడాది ఫిబ్రవరి జీఎస్టీ వసూళ్లకు సంబంధించి కేంద్రప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఫిబ్రవరిలో రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు రూ.5,280 కోట్లుగా నమోదయ్యాయి. నిరుడు ఫిబ్రవరితో పోల్చితే ఒక్క శాతం మాత్రమే పెరిగాయి. తద్వారా దేశంలోనే అత్యల్ప వృద్ధిరేటు నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ అట్టడుగున నిలిచింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి జీఎస్టీ వసూళ్లలో ఏటికేడు వృద్ధి నమోదైంది. అయితే కరోనా సంక్షోభం తలెత్తినప్పుడు మాత్రమే తొలిసారిగా మైనస్ వృద్ధి నమోదైంది. మళ్లీ కాంగ్రెస్ పాలనలోనే వృద్ధిరేటు మందగించినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కీలక రంగాలన్నీ దెబ్బతినడంతో దాని ప్రభావం కొనుగోళ్లపై పడి జీఎస్టీ వృద్ధి స్తంభించిందని చెప్తున్నారు. హైడ్రా, మూసీ సుందరీకరణ వంటి వాటితో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిన్నదని, పెట్టుబడి సాయం అందించక, సరైన సమయంలో పంట కొనుగోళ్లు చేయక వ్యవసాయ రంగం సంక్షోభం వైపు అడుగులు వేస్తున్నదని అంటున్నారు. ఆర్డర్లు లేక చేనేత రంగం విలవిల్లాడుతున్నది. పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధిరేటు నమోదు కావడం లేదని, పరిశ్రమలు వెళ్లిపోతున్న పరిస్థితి ఉన్నదని పేర్కొంటున్నారు. ఇలా కీలక రంగాలన్నీ దెబ్బతింటుండటంతో దేశంలోనే అతి తక్కువ జీఎస్టీ వసూళ్ల వృద్ధితో రాష్ట్రం అట్టడుగున నిలిచిందని చెప్తున్నారు.

నేలకరిచిన ‘రియల్’ రంగం

హైడ్రా, మూసీ సుందరీకరణ, ఎఫ్‌టీఎల్ పేరుతో బెదిరింపులు, విచ్చలవిడి వసూళ్లు.. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ రంగంపై అనేక కోణాల్లో దాడి జరుగుతూనే ఉన్నది. ఫలితంగా 14 నెలల్లోనే రియల్ ఎస్టేట్ రంగం నేలకరించిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నిరుడు జూన్‌లో హైడ్రాను ఏర్పాటు చేసినప్పటి నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం తగ్గడం మొదలైంది. ఈ ఏడాది స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.18,228.82 కోట్లు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ, పది నెలలు గడిచిన తర్వాత జనవరి నాటికి రూ.5,821.88 కోట్లు (31.94 శాతం) మాత్రమే వచ్చాయి. నిరుడు ఇదే సమయానికి ఆ శాఖ ద్వారా రూ.11,700 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే ఈసారి సగానికి పడిపోయినట్టు లెక్క. కరోనా కాలంలోనూ పెద్దగా ప్రభావితం కాని రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ పాలనలో కుదేలైందని ఆ రంగ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్క రియల్ రంగంతో ఆగిపోలేదని, దీని ప్రభావం ఇతర రూపాల్లో ఖజానాపై కనిపించిందని చెప్తున్నారు.

కాంగ్రెస్‌ను వీడితే కేసు!

మొదటిపేజీ తరువాయి...

జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లెలో గ్రామ మాజీ సర్పంచ్ బూరుగుల నందయ్య, యూత్ అధ్యక్షుడు కట్ట గోవర్ధన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో పలువురు యువకులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ విషయం సోషల్‌మీడియాలో ప్రచారం కావడం తట్టుకోలేకపోయిన కొందరు కాంగ్రెస్ నాయకులు, వలసలను వాపస్ తెచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. చేరికల సంఖ్యపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ సోమవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సైతం కాంగ్రెస్ నాయకులకు వంతపాడుతూ అత్యుత్సాహం చూపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మాజీ సర్పంచ్ నందయ్య ఇంటికి కానిస్టేబుల్‌ను పంపి స్టేషన్‌కు రమ్మన్నారు. కొద్దిరోజుల క్రితమే తన తొంటికి శస్త్రచికిత్స జరిగిందని చెప్పాడు. ఇదే విషయాన్ని ఎస్‌ఐకి కానిస్టేబుల్ వివరించాడు. అయినా వినకుండా ఏకంగా పోలీసు వాహనాన్ని పంపి ఆయనను ఠాణాకు తీసుకెళ్లారు. తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు తనపై ఫిర్యాదు వచ్చిందని, ఆధార్‌కార్డు ఇస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారని నందయ్య వాపోయాడు.

హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తాం : సుంకె

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్టేషన్‌కు చేరుకొని అధికారులతో మాట్లాడారు. పార్టీలు మారినంత మాత్రాన భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, ఇలాంటివి పునరావృత్తమైతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఘటనపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. పోలీసులు కాంగ్రెస్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

రుణమాఫీపై ఫిర్యాదుకు వెళ్తే అరెస్ట్

జగిత్యాల జిల్లా మొగిలిపేటలో దారుణం.. మాఫీ అయ్యేవరకు పోరాటం: మాజీ సర్పంచ్ నాగరాజు

మల్లాపూర్, మార్చి 17: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేటలో వంద శాతం రుణమాఫీ కోసం రైతులు పోరుబాట పట్టారు. రైతులతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం రుణమాఫీ అయ్యేంత వరకు రైతులతో కలిసి పోరాడుతామని స్పష్టంచేశారు. ఉద్యమం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ గ్రామంలో 300 మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల జిల్లా మొగిలిపేటలో మాజీ సర్పంచ్ నాగరాజును తరలిస్తున్న పోలీసులు

హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డివి సైకో మాటలు

- ప్రగతి బాట సభ అట్టర్ ఫ్లాప్
- ఉప ఎన్నికభయంతోనే సభ, కడియం శ్రీహరి నీతిమాటలు
- వినయ్‌భాస్కర్, రాజయ్య, సుదర్శన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

హనుమకొండ, మార్చి 17 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైకో, చిత్తశుద్ధిలేని చిల్లర మాటలు మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. వంద ఎలుకలు తిన్న పిల్లిలాగా నిన్నటి సభలో ఏమీ తెలియనట్టు నిలబడ్డాడని, ఆయన తీరు చూస్తే స్టూడెంట్ ముందు లెక్చరర్ నిల్చున్నట్టుందని ఎద్దేవా చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగమేఘాల మీద, ఎవరో తరిమితే ఉరికొచ్చినట్టు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రజాపాలన.. ప్రగతి బాట సభ కళావిహీనంగా, నిర్బంధాల నడుమ సాగి అట్టర్ ఫ్లాప్ అయిందని విమర్శించారు. గ్రామాలను పోలీసు బలగాలు నిర్బంధించాయని, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను హౌస్‌అరెస్ట్ చేశాయని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఉపఎన్నికలు వస్తాయనే భయంతోనే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ సొమ్ముతో ‘ప్రజాపాలన.. ప్రగతి బాట’ పేరుతో సభ నిర్వహించారని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అహంకారానికి, అవినీతికి ప్రజలు జవాబు చెప్పాలని చూస్తున్నారని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా స్టేషన్‌ఘన్‌పూర్‌లో గెలిచేది బీఆర్‌ఎస్ అభ్యర్థి రాజయ్యనేనని స్పష్టంచేశారు. కడియం శ్రీహరికి నమ్మకముంటే రాజీనామా చేసి, కాంగ్రెస్ నుంచి గెలవాలని సవాల్ విసిరారు. సమావేశంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు జానకీ రాములు, జోరిక రమేశ్, రామ్మూర్తి, వెంకన్న పాల్గొన్నారు.